క్లుప్తంగా

27న సత్యనారాయణ స్వామి వ్రతం

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో 27న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక సత్య నారాయణ వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వ్రతంలో పాల్గొనదల చిన దంపతులు ముందుగా రూ.1,116 చెల్లించి కార్యాలయంలో రశీదును తీసుకోవాలని కోరారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో అపశ్రుతి

అయిజ: మండలంలోని చిన్నతాండ్రపాడులో గురువారం రాత్రి బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా ప్రజలు ఎక్కువ మంది హాజరు కావడంతో అక్కడున్న అంబేద్కర్ విగ్రహం చేయి వేలు విరిగిపడింది. అయితే శుక్రవారం బీఆర్ఎస్ కార్యకర్తలు విరిగిపడిన వేలుకు మరమ్మతు చేశారు.

మద్యం పట్టివేత

మల్దకల్: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శుక్రవారం గద్వాల ఎక్సైజ్ ఎస్ఐ గోవర్ధన్ పట్టుకున్నట్లు సీఐ గోపాల్ తెలిపారు. ఎల్కూరు చెందిన బంగి రవి, హన్మంతు రెండు బైకులపై 141 క్వార్టర్ సీసాలు తరలిస్తుండగా గ్రామస్తుల సమాచారం మేరకు రెండు బైకులకు సీజ్ చేసి మద్యాన్ని తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.
మానవపాడు: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు. మండల కేంద్రంలోని వైన్స్ నుంచి అక్రమంగా రూ.83వేల విలువగల మద్యాన్ని తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుబడినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయిజ: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ గోవిందు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా చేసే మండలంలోని తొత్తినోనిదొడ్డి 33 కేవీ ఫీడర్‌కు సంబంధించిన విద్యుత్ స్తంభాల వద్ద చెట్ల కొమ్మలు కత్తరించేందుకు ఎల్‌సీ తీసుకోనున్నట్లు తెలిపారు. దీంతో ఉత్తనూరు, చిన్నతాండ్రపాడు, తొత్తినోనిదొడ్డి సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా అవుతున్నటువంటి ఉత్తనూరు, సంకాపురం, భూంపురం, మేడికొండ, తుపత్రాల, కేశవరం, చిన్న తాండ్రపాడు, బైనిపల్లి, మూగోనిపల్లి, తొత్తినోనిదొడ్డి, గట్టు మండలంలోని ఇందువాసి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏడీఈ గోవిందు కోరారు.

వాల్మీకులు ఏకతాటిపైకి రావాలి

రాజోళి: అలంపూర్ నియోజకవర్గంలోని వాల్మీకులు మొత్తం ఏకతాటిపైకి వచ్చి బీఆర్ఎస్‌కు ఓటియ్యాలని బీఆర్ఎస్ నాయకుడు వేణుగోపాల్ నాయుడు అన్నారు. శుక్రవారం తుమ్మిళ్లతో పాటుగా చిన్న ధన్వాడ, పెద్ద ధన్వాడ, మాన్‌దొడ్డి గ్రామాల్లో ఆయన వాల్మీకి కులస్తులను కలిసి మాట్లాడారు. బోయ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిగా ఎన్నో ప్రభుత్వాలను చూశామని, బోయలను ఎస్టీలుగా చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసిన ఘనత మాత్రం కేసీఆర్‌దేనన్నారు. నియోజవవర్గంలోని బోయలకు న్యాయం కావాలంటే బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తున్న విజేయుడికి వాల్మీకుల ఓట్లు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు



మల్దకల్: గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు డాక్టర్ స్వరూపరాణి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అక్టోబర్ మాసంలో 31ప్రసవాలు జరిగాయని, ఈ మాసంలో ఇప్పటి వరకు 17సాధారణ ప్రసవాలు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందించి వాటిని ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని షాబాద్ చెందిన బోయ పెద్ద నాగన్న (43)కు మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో ఈనెల 19న ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మరింత అభివృద్ధికి బీఆర్ఎస్ అవసరం



బల్గెరలో మాట్లాడుతున్న బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



జిల్లా కేంద్రంలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

గద్వాల రూరల్/కేటీదొడ్డి/గట్టు: బీఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రం, బల్గెర, మాచర్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు గద్వాలకు ఏం చేశారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో పేదలకు గొప్పవరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించినట్లు తెలిపారు. స్వార్థపూరితమైన కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే ఏం అవుతుందో మీకు తెలుసునని, తెలంగాణను తీసుకురావడంతో పాటుగా అభివృద్ధి పథంలో నడిపించిన బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. వాల్మీకి బోయలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎస్టీలుగా ఎందుకు గుర్తించలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని రెండు పర్యాయాలు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే, తేల్చకుండా బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. ఎన్నికల తర్వాత బీజేపీ మెడలు వంచైనా వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో స్టేట్ కన్స్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, బల్గెర హనుమంతు, రూపవతి, సిద్దిరామప్ప, రామకృష్ణారెడ్డి, బస్వరాజు, రాముడు, రాము నాయుడు, సంతోష్, బజారి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి పలువురు చేరిక..

సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమాభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చి చేరుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ మాలీంషబ్బీర్ బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా గద్వాల పట్టణం, గద్వాల, ధరూరు, మల్దకల్, కేటీదొడ్డి, గట్టు మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజలకు పథకాలు వివరిస్తూ..

పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలను వివరిస్తూ మరోసారి బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, ఎమ్మెల్యే సతీమణి బూరెడ్డిపల్లి సర్పంచ్ బండ్ల జ్యోతి కోరారు. శుక్రవారం వారు వేర్వేరుగా గద్వాల పట్టణంలో పలువార్డులలో పర్యటిస్తూ ప్రచారం నిర్వహించారు. ఆసరా పింఛన్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, బీసీబంధు, మైనార్టీ బంధు వంటి పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి ఈనెల 30వ తేదీన జరిగే పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు సాకేత్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలి

బీఆర్ఎస్ అధ్యక్షుడు సీఎం కేసీఆర్ రూపొందించిన పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు అన్నారు. మండలంలోని కుచినెర్ల వివిధ గ్రామాల్లో కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేష్, వెంకట్‌కిషన్‌రావు, ప్రసాద్‌గౌడ్, సతీష్, భీమయ్య, భీంరెడ్డి, నర్సింహులు, సురేష్, ముని తదితరులు పాల్గొన్నారు.

గట్టు మండల పరిధిలోని ఆరగిద్దలో శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



కారు గుర్తుకే వేయాలని మహిళలను కోరుతున్న బండ్ల జ్యోతి



కుచినెర్లలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆధిపత్యం, ఆత్మగౌరవంపైనే పోరాటం



శాంతినగర్‌లో మాట్లాడుతున్న మందా జగన్నాథం, చిత్రంలో సంపత్‌కుమార్, అబ్రహం

శాంతినగర్: ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలు ఆత్మగౌరవం, ఆధిపత్యంపైనే అని ఎమ్మెల్యే అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ పట్టణంలో శుక్రవారం రాత్రి కాంగ్రెస్ శ్రేణులు రోడ్ షో, బైక్ ర్యాలీ, అంబేద్కర్ చౌరస్తాలో బహిరంగసభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐదేళ్లలో అలంపూర్ అభివృద్ధికి ఎంతో కృషిచేశానన్నారు. అలంపూర్ అభివృద్ధి కావాలంటే అన్ని తెలిసినవాడై ఉండాలన్నారు. ఏమీ తెలియని వాడికి ఎమ్మెల్యే పదవి వస్తే ఏమి అభివృద్ధి చేస్తాడన్నారు. ఎస్సీ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ చల్లా పెత్తనమేంటన్నారు. 2009లో తనకు టికెట్ రాకుండా చేశాడని, 2014లో సంపత్‌కుమార్ విషయంలో కూడా చేశాడని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌పార్టీలో చేరానన్నారు. సంపత్‌కుమార్‌ను ఆశీర్వదించి గెలిపించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ మందాజగన్నాథం మాట్లాడుతూ.. తన పుత్రునికి టికెట్ ఇప్పించడంలో ఎమ్మెల్సీ మోసం చేశాడన్నారు. మాజీ ఎమ్మెల్యేలు గద్దం ప్రకాష్‌రెడ్డి, సంపత్‌కుమార్ ఎమ్మెల్సీ తీరుపై మండిపడ్డారు.

పేదలకు బృహత్తర పథకాలు

రాజోళి/ఉండవెల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు బృహత్తర పథకాలు అందుతాయని కర్ణాటక రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే రఘుమూర్తి అన్నారు. మండలంలోని తూర్పుగార్లపాడులో ఆయన అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ కుమార్ తరఫున ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసి పేదలకు న్యాయం చేస్తామన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని తెలిపారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది

కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి వస్తుందని, అలంపూర్ అభ్యర్థి సంపత్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కర్ణాటక ఎమ్మెల్యే, ఏఐసీసీ అబ్జర్వర్ రఘుమూర్తి అన్నారు. శుక్రవారం ఉండవెల్లి మండల కేంద్రంలోని కల్యాణమండపంలో కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. కర్ణాటకలో ఐదు గ్యారంటీలో 4 అమలు చేస్తున్నామని, ఐదవది కూడా త్వరలో మొదలవుతుందన్నారు. అలాంటి సమయంలో తెలంగాణలో ఆరు గ్యారంటీలు రేవంత్ రెడ్డి, సోనియాగాంధీ ఆదేశాలతో ప్రవేశపెట్టిన వాటిని గెలిచిన వెంటనే ప్రవేశపెడుతామని తెలిపారు.

దేశంలో ఎక్కడాలేని విధంగా అభివృద్ధి

అయిజ: దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకపోతుందని, అది బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని చిన్న తాండ్రపాడు, నారోజ్ క్యాంపు, కేశవరం, వేణిసోంపురం, ఉప్పల, ఉప్పల క్యాంపు, పర్దిపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వివిధ మండలాలనుంచి నాయకులు, కార్యర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. తొమ్మిదిన్నర ఏళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక అభివృద్ధి పనులు చేశారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కరువు

- ఆకతాయిలకు అడ్డాలుగా మారిన వైనం
- మద్యం మత్తులో ఫర్నీచర్ ధ్వంసం
- వాచ్‌మన్‌లను ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు



రాజోళి జెడ్పీహెచ్ఎస్‌లో ఇటీవల బయట పడేసిన బెంచీలు

రాజోళి: విద్యాబుద్ధులు నేర్పించే దేవాలయాలు మద్యం బాబులకు అడ్డాగా మారుతున్నాయి. మండలంలో నిత్యం జరుగుతున్న ఆకతాయిల ఆకృత్యాలకు అడ్డుఅదుపు లేకుండా పోతుంది. వారి ఆగడాలల్లో ఎక్కువగా పాఠశాలకు నష్టం వాటిల్లుతుంది. అసలే సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న పాఠశాలల్లో ఆకతాయిల ఆగడాల వల్ల సౌకర్యాల కొరత మరింత తీవ్రమవుతుంది.

మద్యం బాబులకు అడ్డాగా..

ఆదివారం వచ్చిందంటే చాలు ప్రభుత్వ పాఠశాలలు మద్యం బాబులకు అడ్డాగా మారుతున్నాయి. ఇక వారం రోజుల పాటు సెలవులు వస్తే పాఠశాల రూపు రేఖలే మారుతున్నాయి. పాఠశాలలకు సరైన ప్రహరీ, గేట్లు లేకపోవడంతో మద్యం బాబులు సులువుగా పరిసరాలల్లోకి చేరుకుని మద్యం సేవిస్తున్నారు. మద్యం మత్తులో పాఠశాల గదుల్లో ఉన్న బెంచీలు, ఇతర ఫర్నీచర్ తో పాటు, తలుపులు, కిటికీలు ధ్వంసం చేస్తున్నారు. కిటికీల కడ్డీలను వంచేసి లోపలకు వెళ్లడం, బోర్డు మీద పిచ్చి రాతలు రాయడం, గదుల్లోనే మద్యం సీసాలు, సిగరెట్ ముక్కలు పడేసి, గదులను, పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. కనీసం తమ పిల్లలు అక్కడ చదువుతున్నారనే జ్ఞానం లేకుండా పాఠశాల ఆవరణను అపరిశుభ్రం చేస్తున్నారు. దీంతో ఉదయమే పాఠశాలకు వచ్చే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుంది. కొన్ని పాఠశాలలో సరైన వసతులు లేకపోవడంతో దాతల సాయంతో ఫర్నీచర్ ఏర్పాటు చేసుకున్నారు. అలాంటి చోట కూడా ఆకతాయిలు ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కూడా ఇలాంటి తప్పిదాలు ఎక్కువగా జరుగుతన్నాయని, పాఠశాలలో విలువైన ఫర్నీచర్‌ను బాధ్యత లేకుండా బయట పడేయడం, సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఆకతాయిలు మరింతగా రెచ్చిపోతున్నారు. ఇలాంటి ఘటనలపై పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం వల్ల కూడా అవి వరుసగా జరుగుతన్నాయని ప్రజలు అంటున్నారు.

వసతులు కరువు..

పాఠశాలలోకి వెళ్లకుండా కట్టుదిట్టమైన రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్ల కూడా ఇలాంటి నష్టాలు అవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. పాఠశాలలకు ప్రహరీ గోడలు లేవని, తరగతి గదులకు ఉన్న తలుపులు కూడా పాతవైపోవడం, సిబ్బంది తాళాలు వేయకుండా వెళ్లడంతో, మద్యం బాబులు నేరుగా గదుల్లోకి వెళ్లేందుకు అవకాశం కలుగుతుందని, వాటికి పటిష్టమైన రక్షణ చర్యలు చేపడితే ఆకతాయిల ఆట కట్టించవచ్చని ప్రజలు అంటున్నారు. ప్రత్యేకంగా నైట్ వాచ్‌మన్‌లు లేకపోవడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కరువైందని, వాచ్‌మన్‌లను నియమించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలతో పాటు, తుమ్మలపల్లె, పచ్చర్ల, మాన్‌దొడ్డి, పెద్ద ధన్వాడ, పెద్ద తాండ్రపాడు, తుమ్మిళ్ల పాఠశాలల్లో ఈ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాల సిబ్బంది, పోలీసులతో ప్రత్యేకంగా ఈ విషయాలపై చర్చించి కఠిన చర్యలు తీసుకుంటేనే పాఠశాలకు రక్షణ ఉంటుందని లేకపోతే, పాఠశాలలు బార్లుగా మారతాయని అంటున్నారు. గతవారంలో రాజోళి పాఠశాలలోని బెంచీలు బయట ఉండగా, వాటిని ఆకతాయిలు చెట్లకు వేలాడదీశారు. దానిపై పత్రికల్లో వచ్చిన తర్వాత సిబ్బంది వాటిని లోపల పెట్టారు.

బెంచీలు బయట పడేశారు



రాజోళి జెడ్పీహెచ్ఎస్‌లో ఉన్న బెంచీలు కొన్ని రోజులుగా బయటపెట్టారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆకతాయిలు, బెంచీలను చెట్లకు వేలాడదీశారు. దాని వల్ల ఫర్నీచర్ దెబ్బతిని ప్రభుత్వ సొమ్ము ఎంత నష్టపోతుందో అధికారులకు తెలియదా? ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా? వారిపై చర్యలు తీసుకోవాలి.

– శివ, రాజోళి

పోలీసులతో మాట్లాడతాం..

నైట్ వాచ్‌మన్‌లు లేక కొన్ని చోట్ల ఆకతాయిల ఆగడాలు మించిపోతున్నాయి. మేము దాతలను, ప్రజాప్రతినిధులతో మాట్లాడి, ఫర్నీచర్, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తుంటే ఆకతాయిలు చేసే పనులకు ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుంది. గ్రామస్తులు సహకరించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇలాంటి ఘటనలకు చెక్ పెట్టేలా పోలీసులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

– నర్సింహ,ఎంఈఓ, రాజోళి

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్న భక్తులు



కాళికాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

అయిజ: మండల కేంద్రంలోని కాళమ్మపేటలో కొత్తగా నిర్మించిన కాళికాదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారి శిలా విగ్రహ ప్రతిష్ఠను వేదపండితులు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. దానికి ముందు గర్భాలయ వాస్తుపూజ, వాస్తుపర్యగ్నీకరణం, గర్తపూజ రత్నన్యాస, ప్రణ నేత్రోన్మిలన, న్యాసహోమం, కళా హోమం, ప్రతిష్ఠ హోమం, అన్నద దర్శనం, దేను దర్శనం, అగ్రి దర్శనం, కూష్మాండబలి, కదలిచేదన, కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, మహా మంగళహారతి పూజలు చేశారు. అదేవిధంగా మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం, సమస్త భక్తాదులకు దేవతా దర్శనం, మహా ప్రసాదం కార్యక్రమాలను నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ పూజలకు తెలంగాణ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

ఎస్సీ నియోజకవర్గంలో చల్లా ఆధిపత్యం ఏంటి?

ఎర్రవల్లిచౌరస్తా: ఎస్సీలకు రిజర్వేషన్ అయిన అలంపూర్ నియోజకవర్గంలో ఇటీవలే పార్టీలో చేరి ఎమ్మెల్సీ పదవి పొందిన చల్లా వెంకట్రామిరెడ్డి ఆధిపత్యం చెలాయించడం ఏంటని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని ఆయన సందర్శించి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బీచుపల్లిలో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో ఎలాంటి అవగాహన లేని వ్యక్తికి బీఫాంను కేటాయించారన్నారు. సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తనకు చివరికి బీఫాం ఇవ్వకుండా ఎమ్మెల్సీ చల్లా అడ్డుకున్నారని మండిపడ్డారు. 2014తో పాటు ఇప్పుడు కూడా బీఆర్ఎస్ పార్టీ బీఫాం ఇవ్వకుండా చల్లా ఆపారన్నారు. ఒక్కరోజు జైతెలంగాణ అనని వారికి బీఆర్ఎస్‌లో ఉన్నతమైన చోటును కల్పించారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దం ప్రకాష్‌రెడ్డి, అజయ్, రవి, వెంకటేష్, శ్రీనివాసులు, మధునాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి

మానవపాడు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యురాలు రిజ్వానా తస్వీర్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రన్న, ఏఎన్ఎంలు, ఆశాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక తులసి పూజలు



ఉండవెల్లిలో తులసి పూజలు చేస్తున్న మహిళలు



ధరూర్ మండలం కోతులగిద్దలో..

ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరులో కార్తీకమాసంలో తులసిపూజలో మహిళలు పాల్గొన్నారు. శుక్రవారం శివాలయంలో శివపార్వతి విగ్రహాలకు పూజలు నిర్వహించి, తులసి పూజలు చేశారు.
ధరూరు: మండలంలోని కోతులగిద్ద అరణ్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీకపూజలు భక్తి శ్రద్ధలతో చేశారు. శుక్రవారం తెల్లవారుజామున మహిళలు, చిన్నారులు భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్టపై ఆలయం ఎదుట చిన్నారులు, భజన మండలి సభ్యులు భజనలు కొనసాగించారు.

అభ్యర్థుల ప్రచారం

- గత పాలకుల నిర్లక్ష్యంతోనే ఈ ప్రాంతం వెనుకబాటుకు గురైందని, ఓటర్లు మేల్కొని బహుజనులకు అవకాశం కల్పించాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎమ్మెల్యే రంజిత్‌కుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కేటీదొడ్డి, గట్టు మండలాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.
- జిల్లా కేంద్రంలోని 3వ వార్డులో శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి సరిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తనను ఆశీర్వాదించాలని కోరారు.
- బీఎస్పీ తరుపున తనను ఆశీర్వాదించాలని గద్వాల ఎమ్మెల్యే అభ్యర్థి అతిఖుర్ రహ్మాన్ కోరారు. జిల్లా కేంద్రంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
- ఎర్రవల్లి, ఇటిక్యాల మండలాల్లో శుక్రవారం ఆయా పార్టీల శ్రేణులు ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో గడప గడపకు తిరిగారు.

నందిన్నెలో వాహనాల తనిఖీ ముమ్మరం



చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

కేటీదొడ్డి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దత్తురాజ్ ఆదేశాల మేరకు మండలంలోని నందిన్నె చెక్‌పోస్టును ఏర్పాటు చేయగా శుక్రవారం ఎక్సైజ్ సీఐ ఖలీద్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అక్కడ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లిక్కర్, మద్యం, నగదు, అక్రమ రవాణాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కర్ణాటక నుంచి వచ్చే వాహనాలను పరిశీలించిన తర్వాత వాహనాలను అనుమతి ఇవ్వాలని తెలిపారు. వారి వెంట కానిస్టేబుల్ మహేష్, చక్రవర్తి, వినయ్‌కుమార్, పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com